క్లుప్తంగా

నేషనల్ కరాటే కాంపిటీషన్స్‌కు ఏడుగురు విద్యార్థులు

చీమకుర్తి: పేర్నమిట్ట ప్రతిభ కాలేజీకి చెందిన ఏడుగురు విద్యార్థులు నేషనల్ కరాటే కాంపిటీషన్స్ ఎంపికైనట్లు ఆ కాలేజీ సీఈవో జయప్రకాష్ నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూలు గేమ్స్ ఫెండరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టేట్ కరాటే చాంపియన్స్ ఎంపికలో వారు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన కరాటే విద్యార్థులను వారు అభినందించారు.

మహిళకు ఆర్థికసాయం

ఒంగోలు అర్బన్: తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా ఉంటూ పెరాలసిస్‌తో మంచానికే పరిమితమైన సైదాబీ అనే మహిళకు సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్టు సోమవారం ఆర్థికసాయం అందజేసింది. సైదాబీకి ప్రతి నెలా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు ట్రస్టు సెక్రటరీ సర్దార్ బాషా తెలిపారు. ఈ నెల అనారోగ్యంతో ట్రస్టు కార్యాలయానికి రాకపోవడంతో చీరాలలో నివాసం ఉంటున్న సైదాబీ ఇంటికి వెళ్లి రెండు నెలలకు సరిపడా రూ.20 వేలు అందజేశారు.

క్రికెట్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చిరంజీవి

ఒంగోలు: ఒంగోలులో ఫిబ్రవరి 12 నుంచి ప్రారంభించనున్న టీ20 క్రికెట్ పోటీల బ్రోచర్‌ను మెగాస్టార్ చిరంజీవి లాంఛనంగా ఆవిష్కరించారు. సోమవారం హైదరాబాదులో మెగాస్టార్ నివాసంలో టోర్నమెంట్ ఆర్గనైజర్లు ఇందుర్తి డుంబు, రావూరి బుజ్జి, దాసరి పిచ్చయ్య, పాలశెట్టి నాయుడు పాల్గొని చిరంజీవితో బ్రోచర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ తన అభిమానులు సేవా కార్యక్రమాలే కాకుండా క్రీడాకారులను ఉత్సాహపరిచే విధంగా క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తాను చదువుకున్న శర్మ కాలేజీ ఆవరణలో పోటీలు నిర్వహించడం మరింత సంతోషంగా ఉందంటూ నిర్వాహకులను అభినందించారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ సభ్యులు

అల్లూరు (కొత్తపట్నం): చెత్త సేకరించి సంపద తయారు చేసి కేంద్రానికి తరలించే కార్మికులకు మదర్ థెరిసా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం సందర్భంగా సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీజీ వర్ధంతి

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది గ్రామంలో గాంధీజీ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎలిమెంటరీ స్కూల్, హైస్కూల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు గాదంశెట్టి జ్వాలారావు, సెక్రటరీ పాదర్తి శ్యామ్‌బాబు, కరవది గ్రామ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పి.సుబ్బారావు, సెక్రటరీ శిఖాకొల్లి నారాయణ, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అభిమాన సంఘ అధ్యక్షుడు పేరకం నాగ ఆంజనేయులు, కరవది గ్రామ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సేవా కార్యక్రమాలు అభినందనీయం



మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



చీమకుర్తిలో పేద కుటుంబానికి సైకిల్ అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



గుండ్లాపల్లిలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న సర్పంచ్ ఆంజనేయులు, సచివాలయ సిబ్బంది

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ
- ఘనంగా గాంధీజీ వర్ధంతి

చీమకుర్తి: సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి చీమకుర్తిలో నిర్వహించిన గాంధీ వర్ధంతి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు పేద కుటుంబాలు, పాఠశాలలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంప్యూటర్, ప్రింటర్, సైకిల్ వంటి వాటిని జెడ్పీ చైర్‌పర్సన్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ, డాక్టర్ బీ జవహర్, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి శిద్దా నివాళి...

ఒంగోలు: మహాత్ముని జీవితం స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు శిద్దా రాఘవరావు అన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్ముడు చూపిన సత్యం, ధర్మం, అహింసామార్గం మనకు ఆదర్శమన్నారు. ఆచరణీయ సిద్ధాంతంతో మనలను మార్గదర్శకం చేసి నేటి భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.

మద్దిపాడు మండలంలో...

మద్దిపాడు: మండలంలోని పలు సచివాలయాల్లో గాంధీజీ 76వ వర్ధంతి కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గుండ్లాపల్లి సచివాలయంలో సర్పంచ్ కొప్పోలు ఆంజనేయులు, గ్రామ నాయకుడు యేమిరెడ్డి విజయభాస్కరరెడ్డి గాంధీజీ చిత్రపటానికి అంజలి ఘటించారు. దేశం కోసం పాటుపడిన మహనీయులను తలచుకుంటూ శ్రద్ధాంజలి ఘటించారు. వారి వెంట వార్డు మెంబర్ వేణు, పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

బాలికలకు హక్కులపై అవగాహన కల్పించాలి



రాజ్యాంగంపై పుస్తకాలు అందజేస్తున్న కొల్లా

ఒంగోలు టౌన్: పాఠశాల స్థాయి నుంచే బాలికలకు హక్కులపై అవగాహన కల్పించాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు సూచించారు. గద్దలగుంట ఆరామక్షేత్రంలో సోమవారం రెండో రోజు నిర్వహించిన జేవీవీ శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. మహిళా హక్కుల రాజ్యాంగం మూల సూత్రాల గురించి ప్రసంగిస్తూ ఉపాధ్యాయులు కూడా రాజ్యాంగంలో పొందుపరిచిన మహిళల హక్కుల గురించి సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు. తమ హక్కులను తెలుసుకుని పిల్లల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంపొందించాలని కోరారు. చదువుకున్న మహిళల్ని కూడా మూఢనమ్మకాలు తప్పుదారి పట్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంప్రదాయాల మాటున మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ఎదిరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు సుజాత, కృష్ణవేణి, మహాలక్ష్మి, హసీనా, విశాల, పద్మలత, జయలక్ష్మి, నాగలక్ష్మి, చిట్టెం వెంకటేశ్వర్లు, జంపా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలి



జీఎంఎస్‌కేలతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీరామ్

మద్దిపాడు: గ్రామాల్లో అప్రమత్తంగా మెలుగుతూ అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించాలని ఎస్సై శ్రీరామ్ సూచించారు. సోమవారం గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎస్పీ మలికాగర్గ్ ఇచ్చిన రోజువారీ విధుల గురించి చర్చించారు. ప్రతిరోజూ గ్రామాల్లో అవేర్‌నెస్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నారా..లేదా..? అంటూ ప్రశ్నించారు. దిశ యాప్, గ్రామాల్లోని రహదారులపై సీసీ కెమేరాలు ఏర్పాటు చేయడం, సైబర్ క్రైమ్స్, లాక్డ్ హౌస్‌ను గుర్తించడం, ఈవ్‌టీజింగ్, ఫోన్‌లో వన్ టైమ్ పాస్ వర్డ్ చెప్పించుకుని చేసే మోసాలపై జీఎంఎస్‌కేలకు వివరించి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా జిల్లా ఎస్పీ ఇచ్చిన టాస్క్‌లను ప్రతి జీఎంఎస్‌కే పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. గ్రామాల భద్రతకు జీఎంఎస్‌కేలు పాటుపడాలని ఆయన కోరారు. ఆయన వెంట మండలంలోని జీఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌ను బలోపేతం చేయాలి



ఎన్‌ఎస్‌ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

ఒంగోలు టౌన్: సామాజిక మార్పు, దేశ సమైక్యత కోసం ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు పాటుపడాలని ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డా.ఎం.రవిశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం ఒంగోలులోని యూనివర్శిటీ క్యాంపస్‌లో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఎన్‌ఎస్‌ఎస్ కీలకపాత్ర పోషిస్తోందని స్పెషల్ ఆఫీసర్ బి.కృష్ణ అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లను బలోపేతం చేయాలని, సిక్ యూనిట్లను కొత్త కాలేజీలకు బదిలీ చేయాలని అసిస్టెంట కో ఆర్డినేటర్ డి.రవిశంకరరెడ్డి సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల బడ్జెట్ పెంచినట్లు వెల్లడించిన ఆయన.. వెంటనే ఎస్బీఐలో కరెంట్ ఖాతా తెరవాలని కోరారు. కార్యక్రమంలో డా.మండే హర్షప్రియతమ్ దేవ్, ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఓఎస్‌టీ డాక్టర్ కేవీఎన్ రాజు, మేధాఫార్మసీ ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు తదితరులు ప్రసంగించారు. అనంతరం స్టేట్ అవార్డు గ్రహీత డా.కమండే హర్షప్రియతమ్‌దేవ్‌ను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో ప్రకాశం జిల్లాలోని 85 కళాశాలలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొని రోడ్‌మ్యాప్ తయారు చేశారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

మద్దిపాడు: ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకూ కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ మానస తెలిపారు. సోమవారం గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. కుష్టువ్యాధిపై అవగాహన కల్పించడానికి యాక్షన్ ప్లాన్ తయారు చేసినట్లు చెప్పారు. పదిహేను రోజుల పాటు విలేజ్ క్లినిక్‌లలోని సిబ్బంది అందరూ కుష్టు వ్యాధిపై అవగాహన కల్పిస్తూ గ్రామంలో సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. స్పర్శలేని రాగి రంగు మచ్చలు కలిగి ఉంటే అటువంటి వారిని పీహెచ్‌సీకి రిఫర్ చేయాలని ఎంఎల్‌హెచ్‌పీలకు సూచించారు. కార్యక్రమంలో కుష్టు లేని సమాజాన్ని ఏర్పాటు చేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి సచివాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంవో ప్రసాద్, ఎంపీహెచ్‌ఈవో వెంకారెడ్డి, ఎంపీహెచ్‌ఎస్ బాలకోటయ్య నాగేశ్వరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫేస్ రికగ్నైజ్డ్ అటెండెన్స్ విధానాన్ని రద్దు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఒంగోలు టౌన్: మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు ఫేస్ రికగ్నైజ్డ్ అటెండెన్స్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఏపీ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు కోరారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు సయ్యద్ సర్దార్ అధ్యక్షత వహించిన ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాసర్‌వలి, గుజ్జుల బాలిరెడ్డి, హరిబాబు, చెన్నులు, ఇర్మియ, సి.అశోక్, మస్తాన్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని నిర్మూలించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

అల్లూరు (కొత్తపట్నం): కుష్టు వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలని అల్లూరు ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల శాంతారావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి సోకిన వారిని వివక్షకు గురిచేయకుండా ప్రేమగా అక్కున చేర్చుకోవాలని సూచించారు. సమాజంలోని కుష్టు వ్యాధిగ్రస్తులను చిన్న చూపు చూడకూడదన్నారు. వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి అన్ని విధాలుగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామారావు, ఏఎన్‌ఎంలు సుభాషిణి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జంతు సంరక్షణపై అవగాహన



విద్యార్థులకు వివరిస్తున్న డీడీ రమేష్‌బాబు

చీమకుర్తి: జంతు సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలం చిలకపాడు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు సోమవారం డీడీ ఏ రమేష్‌బాబు అవగాహన కల్పించారు. మనుషుల దైనందిన జీవితంలో జంతువులు కూడా ఒక భాగమని, జంతువులపై మనుషులు దయతో ప్రవర్తించాలని తెలిపారు. జంతువుల సంరక్షణ, పోషణ, ఆరోగ్యం, వంటి అంశాలపై సానుకూలంగా నడుచుకోవాలని తెలిపారు. వ్యవసాయం, ఆహార ఉత్పత్తులు, ఉపాధి కల్పనలో జంతువులు మనుషులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బీ శ్రీనివాసరావు, వెటర్నరీ డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేయాలి



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న బాలచెన్నయ్య

కొత్తపట్నం: ఇంటి పన్నులు ఫిబ్రవరి 15 నాటికి నూరు శాతం వసూలు చేయాలని ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఇంటి పన్నుల వసూళ్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొండి బకాయిలు, గతేడాది బకాయిలు వెంటనే వసూలు చేయాలని సూచించారు. ముందుగా వారికి 15 రోజుల ముందు డిమాండ్ నోటీసులు జారీ చేయాలన్నారు. ఇంటి పన్నులు చెల్లించని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రొయ్యల హేచరీలు కూడా చెల్లించాలని కోరారు. చెత్త సంపద తయారీ కేంద్రాల నిర్మాణ పనులు పాదర్తి, గాదెపాలెం, వజ్జిరెడ్డిపాలెంలో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వర్మీకంపోస్టు తయారు చేసి విక్రయించాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూపీసీలన్నీ ఉపయోగంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశ్రామిక అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలి



జిల్లా పరిశ్రమల శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లా పారిశ్రామిక అభివృద్ధికి రాబోయే 15 సంవత్సరాలకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రకాశం భవనంలో డీఐఈపీసీ(జిల్లా పారిశ్రామిక ఎగుమతుల అభివృద్ధి కమిటీ) కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు ఫిబ్రవరి 20వ తేదీలోగా పూర్తి చేయాలన్నారు. ఎంఎస్‌ఎంఈ పార్కులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పనిచేయాలన్నారు. దీనిలో పరిశ్రమల శాఖ, రిజిస్ట్రేషన్, ఏపీఐఐసీ, లీడ్ బ్యాంక్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2 నుంచి 32వ డివిజన్‌లో గడప గడపకు



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, వేదికపై మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్ తాడి కృష్ణలత

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రతి గడపకు వెళ్లే విధంగా ఏర్పాట్లు
- వార్డు సచివాలయ సిబ్బందితో సమీక్షించిన కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఫిబ్రవరి 2వ తేదీ నుంచి నగరంలోని 32వ డివిజన్ పరిధిలో నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ మేరకు డివిజన్‌లోని గద్దలగుంట రెండో సచివాలయంలో సోమవారం సచివాలయ సిబ్బందితో నగర మేయర్ గంగాడ సుజాత, స్థానిక కార్పొరేటర్ తాడి కృష్ణలతతో కలిసి ముందస్తు సమావేశాన్ని కమిషనర్ నిర్వహించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఏ విధంగా సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలో వివరించారు. గడప గడపకు వెళ్లే సమయంలో ప్రతి ఇంట్లో.. వారికి వచ్చిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను ముందుగా అందజేయాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు వచ్చిన వారి ఇళ్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్లను, పథకాలు రాని వారి ఇళ్లను కూడా ఎమ్మెల్యే బాలినేని సందర్శిస్తారన్నారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రతి గడపను పలకరించే విధంగా వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాన్ని రూపొందించాలని సూచించారు. ఎలాంటి హడావిడి లేకుండా కార్యక్రమం సజావుగా కొనసాగేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ చేరుతున్నాయా..లేదా..? అని తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డోర్ టూ డోర్ గార్బేజ్ కలెక్షన్ విధానంలో తప్పనిసరిగా మూడు బుట్టల పద్ధతిని అవలంబించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగం, ప్లాస్టిక్ బ్యానర్లను రద్దు విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ద్వారా జగనన్న ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. శానిటేషన్ సూపర్‌వైజర్ పిచ్చయ్య, 32వ డివిజన్ నాయకులు ఓగిరాల వెంకట్రావు, గద్దలగుంట రెండో సచివాలయ ఆర్పీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల తనిఖీ



పిల్లలను పాఠాల గురించి అడిగి తెలుసుకుంటున్న అజయ్‌బాబు, రామ్మోహన్

కొత్తపట్నం: రెండో ఫేజ్‌లో నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలలను ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏఈ రామ్మోహన్, ఎంఈవో అజయ్‌బాబు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాదర్తి ఎంపీపీ స్కూల్‌లో పనులను పరిశీలించిన అనంతరం రామ్మోహన్ మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా ఫేజ్-2లో 30 పాఠశాలలకు రూ.15,1,76,00 మంజూరయ్యాయన్నారు. 15 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. మిగతా పనులు జరుగుతున్నాయన్నారు. ఈతముక్కల పల్లెపాలెం ఎంపీపీ స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలు 2, డీడీ కాలనీలో ఎంపీపీ స్కూల్, ఆర్‌ఆర్ కాలనీ, పాదర్తిలో ఎంపీపీ స్కూల్ పనులు మొదలుపెట్టలేదన్నారు. వీటిని వెంటనే ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాదర్తి ఎంపీపీ స్కూల్‌ను అజయ్‌బాబు తనిఖీ చేశారు. పిల్లలను పాఠాల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఉపాధ్యాయురాలిని ఆదేశించారు.

ఆక్వా జోన్‌లోకి అర్హుల పొలాలు

కొత్తపట్నం: రొయ్యలు సాగు చేసే రైతుల పొలాలను అక్వా జోనేషన్‌లోకి చేర్చడానికి గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరి పొలాలను ఆక్వా జోనేషన్‌లోకి తీసుకురావడం జరుగుతుందని మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్ తెలిపారు. మండలంలోని కొత్తపట్నం, గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, అల్లూరు గ్రామాల్లో సోమవారం గ్రామ సభలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పది ఎకరాల్లోపు ఉండి రొయ్యలు సాగు చేస్తున్న రైతులు, వెబ్ ల్యాండ్‌లో భూమి ఆన్‌లైన్ అయిన రైతులు అర్హులన్నారు. ఆక్వా జోనేషన్‌లో చేర్చితే వారికి విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. గ్రామ సభలో తీర్మానం చేసిన అనంతరం జిల్లా కమిటీలో తీర్మానమైన రైతులకు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. మంగళవారం పాదర్తి, మోటుమాల, గుండమాల, ఆలూరు, గాదెపాలెం గ్రామాల్లో గ్రామ సభలు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని రొయ్యల రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో ఆషా, పంచాయతీ కార్యదర్శి ఈదుపల్లి సునీత, ఎంపీటీసీ సభ్యుడు రామలింగం వెంకట్రావు, గ్రామ ఫిషరీష్ అసిస్టెంట్లు స్వప్న, స్వర్ణలత, రైతులు పాల్గొన్నారు.

నేడు క్యాన్సర్ వైద్య శిబిరం

ఒంగోలు రూరల్: ఎంఎన్‌ఆర్ హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో క్యాన్సర్ అవేర్‌నెస్ స్క్రీనింగ్ ప్రోగ్రాంను కరవది సచివాలయంలో మంగళవారం నిర్వహించనున్నట్లు పీఆర్వో మెహద్‌కుమార్ తెలిపారు. మెడికల్ అన్‌కాలజిస్ట్ సాయికృష్ణ ఆధ్వర్యంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. బీపీ, షుగర్ ఉచిత పరీక్షలతో పాటు మహిళలకు గర్భకోశ పరీక్షలు, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రూరల్ గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

